
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శుక్రవారం 5 జనవరి 2024



మస్తు ఆమ్దానీ



- ఆర్టీసీకి పెరిగిన ఆదాయం
- గతం కంటే రోజుకు రూ.7 లక్షలు అదనం
- 'మహాలక్ష్మి' పథకానికి విశేష స్పందన
- ఇప్పటి వరకు 8 లక్షల మంది మహిళలు ఫ్రీ జర్నీ

జనగామ టౌన్, జనవరి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరు గ్యారెంటీల్లో మొట్ట మొదటగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించింది. అనేక సందేహాల మధ్య ప్రారంభమైన ఈ పథకం ఎట్టకేలకు రోడ్డెక్కి విజయవంతంగా కొనసాగుతోంది. 'మహాలక్ష్మి' కింద మహిళల కోసం ప్రారంభించిన ఈ పథకం ఆర్టీసీ ఆదాయాన్ని పెంచు తోంది. మహిళల నుంచి విశేష స్పందన రావడంతో ప్రయాణికుల సంఖ్య ఊహించని రీతిలో పెరిగింది. ఈ సదవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటుం డగా, ఆర్టీసీ సంస్థ ఆదాయం అమాంతం పెరిగిపోతోం ది. గతంతో పోలిస్తే ప్రస్తుతానికి రోజుకు సగటున రూ.7 లక్షల ఆదాయం పెరిగింది.

20 రోజుల్లో రూ.5 కోట్లు..

గతేడాది డిసెంబరు 8న మధ్యాహ్నం 2 గంటలకు జనగామలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. మొదట్లో ఎలాంటి షరతులు లేకుండానే మహిళలంద రికీ బస్సుల్లో ప్రయాణానికి అవకాశం కల్పించారు. ఆరు రోజుల పాటు భేషరతుగా ప్రయాణ సౌకర్యం కల్పించగా.. ఆ తరువాత డిసెంబరు 15 నుంచి జీరో టికెట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఏదైనా గుర్తింపు కార్డు చూపించి ప్రయాణం చేయాలని నిబంధన పెట్టారు. అప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారి లెక్కలు చూసుకుంటే జనగామ డిపోకు సగటున రోజుకు రూ.26 లక్షల ఆదాయం వస్తోంది. గతంలో రోజుకు 19 లక్షల ఆదాయం రాగా.. ఇప్పుడు అదనంగా రూ.7 లక్షలు పెరిగింది.

గతేడాది డిసెంబరు 15 నుంచి జీరో టికెట్ అమలు లోకి రాగా జనవరి 3 వరకు లెక్కలు చూస్తే 20 రోజు ల్లో జనగామ డిపో పరిధిలో 8,18,787 మంది మహిళ లు ప్రయాణం చేశారు. వీరికి సంబంధించి రూ. 3,48,53,765 ఆదాయం ఆర్టీసీ ఖాతాలో నమోదైంది. ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ రూపంలో ఈ మొత్తం జమ కానుంది. వీరికి తోడు 20 రోజుల్లో 6,53,362 మంది పురుషులు ప్రయాణించారు. వీరికి సంబంధించి రూ.1,73,76,460 ఆదాయం వచ్చింది. మొత్తంగా రూ.5 కోట్ల 22 లక్షల 30 వేల 225 ఆదా యం వచ్చింది. మహాలక్ష్మి పథకానికి ముందు సగటున రోజుకు రూ.19 లక్షల ఆదాయం రాగా.. ఇప్పుడు రూ.26 లక్షలు వస్తోంది. పెరిగిన ప్రయాణి కులకు అనుగుణంగా బస్సు సర్వీసులను కూడా అధికారులు పెంచారు. గతంతో పోలిస్తే రోజుకు వెయ్యి కిలోమీటర్ల సర్వీసులు అదనంగా పెంచామని ఆర్టీసీ డీఎం జ్యోత్స్న చెప్పారు. కొన్ని గ్రామాలకు చివరి బస్సు టైమింగులను మార్చి అదనపు సర్వీసులు ఇస్తున్నామని తెలిపారు.

శ్రమిస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమైనప్పటి నుంచి ఆర్టీసీ అధికారులు విరామం లేకుండా పని చేస్తున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇక మహిళా ప్రయాణికులు బస్సుల్లో కిక్కిరిసిపోతుండగా డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీ కత్తి మీద సాములా మారుతోంది. అయినా వారు ఓపిక, సహనంతో పనిచేస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. అడుగు తీసి అడుగు ముందుకు వేయలేని స్థితిలో టికెట్లు కొట్టడం కండక్టర్లకు పరీక్షగా మారుతోంది. ప్రయాణికుల మేలు కోసం తాము ఎంతో శ్రమిస్తున్నామని డ్రైవ ర్లు, కండక్టర్లు చెబుతు న్నారు. మరోవైపు అధికా రులు నిత్యం వీడియో కాన్ఫరె న్స్‌ల్లో పాల్గొంటూ క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు.

భారీగా రద్దీ..

జనగామ బస్టాండ్ నిత్యం మహిళా ప్రయా ణికులతో రద్దీగా కనిపిస్తోంది. భారీగా ప్రయా ణికులు పెరిగి పోవడంతో ఇప్పుడున్న బస్టాండ్ కిక్కిరిసి పోతుంది. దీంతో అధికారులు బస్టాండ్‌లో కొన్ని మరమ్మతు పనులు చేపట్టారు. రెండు ప్లాట్‌ఫామ్‌లను పెంచేందుకు చర్యలు తీసుకుంటు న్నారు. ప్రస్తుతం దేవరుప్పుల, పాలకుర్తి రూట్లకు వెళ్లేందుకు సరైన ప్లాట్‌ఫామ్స్ లేవు. ఇప్పుడున్న ప్లాట్‌ఫామ్ పక్కన మూత్రశాలలను తొలగించి అటు వైపు పాలకుర్తి, దేవరుప్పుల బస్సులు ఆగేందుకు ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసేలా పనులు మొదలుపెట్టారు. అంతేగాకుండా బస్టాండ్ మధ్యలో ఉన్న కొరియర్ సెంటర్‌ను అక్కడి నుంచి మరో వైపునకు తరలిస్తున్నారు. ఈ పనులకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని డీఎం జ్యోత్స్న తెలిపారు.

ఉచితం కావడంతో ఆర్టీసీ వైపే మొగ్గు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినప్పటి నుంచి మెజా రిటీ ప్రజలు బస్సుల్లోనే ప్రయాణించడానికి మొగ్గు చూపుతున్నారు. గతంలో క్రూజర్లు, ఆటోలు, కార్లు తదితర ప్రైవేటు వాహనాల్లోనూ తమ గమ్యస్థానాలకు చేరుకునే వారు. ఇప్పుడు ఆర్టీసీలో మహిళలకు ఉచితం కావడంతో ఆలస్యం అయినా అందులోనే ప్రయాణిస్తు న్నారు. మహిళలతో పాటు వారి కుటుంబ సభ్యులైన పురుషులు కూడా ఆర్టీసీలో ప్రయాణం చేస్తుండడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతోంది. గతంలో బస్సు సీట్లు ఫుల్లుగా కనిపించే దృశ్యాలు సాధారణంగా కనిపించగా.. ఇప్పుడు బస్సుల న్నీ దాదాపు కిక్కిరిసి పోతున్నా యి. బస్సులో 60 శాతం మహిళ లు ప్రయాణిస్తుండగా, 40 శాతం పురుషులు వెళ్తున్నారు.

ప్రయాణికులు సహకరించాలి...

- జ్యోత్స్న, ఆర్టీసీ డీఎం, జనగామ



ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కండక్టర్లు, డ్రైవర్లు డబుల్ డ్యూటీలు చేస్తున్నారు. వారికి ప్రయాణికులు సహకరించాలి. ప్యాసింజర్స్ పెరగడంతో మరిన్ని బస్సులు కావాల్సి ఉంది. ఇంతకుముందు రాత్రి 9 గంటల వరకు ప్రయాణికులు ఉండేవారు. ఇప్పుడు 10.30 గంటల వరకు కనిపిస్తున్నారు. మరో 20 బస్సులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం.

జిల్లాలో 31,256 దరఖాస్తులు



జనగామలోని సెయింట్ పాల్స్ స్కూల్‌లో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, జనవరి 4 : జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమం ఆరో రోజు ప్రశాంతంగా కొనసాగింది. గురువారం జనగామ నియోజకవర్గంలో 11,089, పాలకుర్తి నియోజకవర్గంలో 7,881, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 12,286 దరఖాస్తులు రాగా.. జిల్లా వ్యాప్తంగా 31,256 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. బచ్చన్నపేటలో 2676, జనగామ రూరల్‌లో 2571, నర్మెటలో 1508, తరిగొప్పులలో 643, జనగామ అర్బన్‌లో 3691 దరఖాస్తులు, చిల్పూరులో 2838, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 2808, లింగాలఘణపురంలో 1943, రఘునాథపల్లిలో 3071, జాఫర్‌గడ్‌లో 1626 దరఖాస్తులు, దేవరుప్పులలో 1903, కొడకండ్లలో 1570, పాలకుర్తిలో 4408 దరఖాస్తులు వచ్చాయి. జనగామ పట్టణంలోని నెహ్రూ పార్క్‌లో గల సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ శివలింగయ్య, అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్ సందర్శించారు.

పథకాలు అందించడానికే ప్రజా పాలన

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర



మీదికొండలో దరఖాస్తు స్వీకరిస్తున్న సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 4 : సంక్షేమ పథకాలను అందరికి అందించడానికే ప్రజా పాలనను ప్రభుత్వం తీసుకువచ్చిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర తెలిపారు. గురువారం మండలంలోని రాఘవపూర్, మీదికొండ గ్రామాల్లో జరిగిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా సోనియాగాంధీ పుట్టిన రోజును పురస్కరించుకొని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంను ప్రారం భించడం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి గాను ప్రజా పాలన ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరికి అందిస్తామని చెప్పారు. ప్రతీ ఒక్కరు విధిగా అభ యహస్తం దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండి అమలు చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమని ఇందిర పేర్కొన్నారు. కార్యక్ర మంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, పార్టీ జిల్లా నాయకులు నాగరబోయిన శ్రీరాములు, కాసాని బొందయ్య, మాజీ జడ్పీటీసీ గుర్రం యాదగిరి, తాటికొండ జాతర చైర్మన్ కొరుకొప్పుల మహేందర్, ఎంపీటీసీ దయాకర్, నీల శ్రీధర్, చింత ఎల్లయ్య, పవన్, మహేష్‌రెడ్డి, ఎదునూరి రాజు, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

కేంద్ర భూగర్భ జలబోర్డు ప్రాంతీయ సంచాలకుడు కృష్ణమూర్తి



గంగాపూర్‌లో మాట్లాడుతున్న కేంద్ర భూగర్భ జలబోర్డు ప్రాంతీయ సంచాలకుడు కృష్ణమూర్తి

బచ్చన్నపేట, జనవరి 4 : భూగర్భ జలాల పెంపు ప్రతీ ఒక్కరి బాధ్యత అని, నీటిని వృథా చేయకుండా కాపాడాలని కేంద్ర భూగర్భ జలబోర్డు ప్రాంతీయ సంచాలకుడు జి.కృష్ణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని గంగాపూర్ గ్రామంలో సర్పంచ్ బందారపు సుశీల అధ్యక్షతన భూగర్భ జలవ నరుల పెంపుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మూడు గ్రామాల్లో రూ.2 కోట్లకు పైగా వెచ్చిం చి చెక్‌డ్యామ్‌లు, నీటి నిలువ ట్యాంకులు, రీచార్జ్ పిట్స్ వంటి పలు నిర్మాణా లు జరిగాయని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఇంకుడు గుంతలు, నీటి నిలువ పనులు చేయాలన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భంలో దాచేలా పర్కులేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్‌లు నిర్మించుకోవాలన్నారు. ఇందుకు కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ సైంటిస్ట్‌లు రాణి, సుధీర్‌కుమార్, మధుసూదన్, విజయకేతన్ మహంతి, క్లస్టర్ టీఏ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాదిగ జాతి భవిష్యత్‌కు ఉద్యమించాలి

ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్



మాట్లాడుతున్న చిప్పలపల్లి సోమశేఖర్

జనగామ టౌన్, జనవరి 4 : మాదిగ జాతి భవిష్యత్ కోసం ఆ వర్గానికి చెందిన ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు ఉద్యమించాలని ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం జనగామలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. మాదిగ హక్కుల సాధన, అన్ని రంగాల్లో వాటా, భావితరాల భవిష్యత్ కోసం యుద్ధానికి సిద్ధం కావాలన్నారు. మంద కృష్ణమాదిగ సారథ్యంలో విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు.

జిల్లా కమిటీ ఎన్నిక..

విద్యార్థుల సదస్సు ముగిశాక ఎంఎస్‌ఎఫ్ జనగామ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందమల్ల ఉదయ్‌కిరణ్, అధికార ప్రతినిధిగా తాళ్లపల్లి తేజ, ప్రధాన కార్యదర్శిగా వల్లూరి శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కల్లెపు వరుణ్‌సందేశ్, పానుగంటి పాల్సన్‌రాజ్, కొలిపాక దినేశ్, కార్యదర్శులుగా జగదీశ్, శివకుమార్, అభిషేక్, ప్రచార కార్యదర్శిగా వైష్ణవ్, సహాయ కార్యదర్శిగా కిరణ్ ఎన్నికయ్యారు. సమావేశంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు రాగల్ల ఉపేందర్, పైసా రాజశేఖర్, సోమశేఖర్, సందెన రవీందర్, కొడిదేటి కుమార్, సుధాకర్, కుమార్, మచ్చ అబ్బయ్య, గువ్వల రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి

జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో చంద్రశేఖర్‌రావు

ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం

ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు

రూ.1.59 లక్షల జరిమానా విధింపు

జఫర్‌గడ్, జనవరి 4 : గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పనులను ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ అధికారి చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జఫర్‌గడ్ మండలంలో మొత్తం 177 పనులు చేపట్టగా వాటికి రూ.4.59 కోట్లు ఖర్చు చేశారు. ఈ పనులు, ఖర్చులపై పది రోజుల పాటు ఆయా గ్రామాల్లో డీఆర్‌పీల ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించి నివేదికలను తయారు చేశారు. ఈ నివేదికలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ రడపాక సుదర్శన్ అధ్యక్షతన 14వ విడత మండల స్థాయి సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం(ప్రజా వేదిక) ద్వారా సమీక్షించారు. ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీఆర్‌డీవో చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ఈజీఎస్ అధికారులు, ఉద్యోగ సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. పనులు, నివేదికల తయారీ, బిల్లుల చెల్లింపు, తప్పుల నమోదు వంటి ఏవేని అవకతవకలు జరిగినా బాధ్యులపై చర్యలు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఎంపీపీ సుదర్శన్, జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీలకు వరం లాంటిదని, వీరి జీవనోపాధికి ఎంతగానో తోడ్పడుతోందన్నారు. ఈ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.1.59 లక్షల జరిమానా..

ఏడాదిగా మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో పలు అవక తవకలు, రికార్డులు, మస్టర్ల నిర్వహణలో తప్పుడు నమోదు వంటి పలు అంశాలు సోషల్ ఆడిట్‌లో వెలుగు చూశాయి. గురువారం గ్రామాల వారీగా నిర్వహించిన సమీక్షలో రూ.1.59 లక్షల నిధులు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఈ నిధుల రికవరీ కోసం బాధ్యులైన అధికారులు, ఉద్యోగ సిబ్బందికి జరిమానా విధించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులపై అడిషనల్ డీఆర్‌డీవో చంద్రశేఖర్‌రావు సాయం త్రం వరకు సమీక్షించారు. సోషల్ ఆడిట్‌లో సమర్పించిన నివేదికలపై ఆయా గ్రామాల వారీగా పనులను సమీక్షించి చోటుచేసుకున్న తప్పులపై సంబంధిత ఉపాధి హామీ అధికారులు, ఉద్యోగ సిబ్బందిని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, డీపీవో నాగేశ్వర్‌రావు, అంబుడ్స్‌మెన్ గాదెపాక రాజు, వీవీసీ సంధ్య, ఈజీఎస్ ఏపీవో రాజకరుణ, డీఆర్‌పీలు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



ఈజీఎస్ సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం సమావేశంలో పాల్గొన్న జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ సుదర్శన్, జడ్పీటీసీ బేబి, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి

మహా జాతరలో మెరుగైన వైద్య సేవలందించాలి

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

ములుగు కలెక్టరేట్, జనవరి 4: ఫిబ్రవరిలో జరిగే మేడా రం సమ్మక్క, సారలమ్మ మహా జాతరలో భక్తులకు మెరు గైన సేవలు అందించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. ములుగు కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అధ్యక్షతన గురువారం జరిగిన ఉమ్మడి వరంగ ల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడారం మహా జాతరలో వైద్య, ఆరోగ్య శాఖ నిర్వర్తించే బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. జాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుం చి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. జాతరలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అధికారుల మధ్య సమన్వయం కలిగి ఉండాలని అన్నారు. డీఎంహెచ్‌వో, జాత ర నోడల్ అధికారి అల్లెం అప్పయ్య మాట్లాడుతూ మేడారం మహా జాతరలో విధులు నిర్వర్తించడానికి సంసిద్ధంగా ఉన్నామ న్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్యాధికా రుల సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు. వివిధ జిల్లాల్లో పనిచేసే వైద్యాధికారులు సైతం జాతర సమయంలో ప్రత్యేక వైద్యసేవలు అందించే విధంగా ఉత్త ర్వులు జారీ చేయాలని హెల్త్ డైరెక్టర్‌ను కోరారు. గతంలో జరిగిన జాతరలను దృష్టిలో పెట్టుకుని తొమ్మిది విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్యనిపుణులు అందు బాటులో ఉంటా రని తెలిపారు. 2022లో జరిగిన జాతరలో 2 లక్షల మంది భక్తులకుపైగా ఓపీ సేవలు అందిం చామన్నారు. ఈసారి జరిగే జాతరకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యాధికారులు సాంబశివరావు, ప్రశాంత్, రమణ, మధుసూదన్, శిరీష, అంబరీష్, ములుగు జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుతోనే దిగుబడి

ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అనిల్‌కుమార్



పత్తి పంటను క్షేత్ర పరిశీలన చేస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 4 : రైతులు అధిక సాంద్రత కలిగిన పత్తిని సాగు చేసినట్లయితే అధిక దిగుబడి రావడంతో పాటు పంట చేతికి వచ్చే కాలవ్యవధి కూడా తక్కువగా ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని మీదికొండ గ్రామంలో గురువారం ఏరువాక కేంద్రం యా దాద్రి భువనగిరి, కేంద్రీయ పత్తి పరిశోధన కేంద్రం నాగపూర్ ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతిపై ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధిక సాంద్రత పత్తి సాగు వలన ప్రతీ చదరపు మీటరుకు నాటే మొక్కల సంఖ్య పెరుగుతుందన్నారు. మొక్కల ఎత్తు పెరుగుదలను 4 నుంచి 5 అడుగుల వరకు రసాయన మందులు వాడి నియంత్రించడం వలన మొక్కలు త్వరగా కాపుకు వచ్చి ఎక్కువ కాయలను నిలుపుకునే సామర్థ్యం కలిగి ఉండడం వలన అధిక దిగుబడి పొందవచ్చునని తెలిపారు. ఈ పద్ధతిలో ఒకేసారి పూత, కాత రావడం వలన యంత్రాల ద్వారా పత్తి ఏరడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన జోగు థామస్ సాగు చేసిన అధిక సాంద్రత పత్తి పంటను అధికారులు, రైతులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరబోయిన మణె మ్మయాదగిరి, వెంకటేశ్వర్లు, లావణ్య, మమత, శరత్‌బాబు, నరేష్, వేణు, సుమలత, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో సమీక్షారెడ్డికి అవార్డు

సుబేదారి, జనవరి 4: ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఇటీవల జరిగిన 13వ కృష్ణ రంగ్ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో హనుమకొండ సుబేదారి ప్రాంతానికి చెందిన కె.సమీక్షారెడ్డి ప్రతిష్ఠాత్మకమైన ప్రెసిడెంట్ చాయిస్ అవార్డు గెలుచుకుంది. సమీక్షారెడ్డి ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. సమీక్షారెడ్డిని గురువారం ఉపాధ్యాయులు అభినందించారు.

7న మడికొండలో రెడ్డి సంక్షేమ సంఘం సమావేశం

కాజీపేట జంక్షన్, జనవరి 4: ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం, డెయిరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. విశిష్ట అతిథిగా పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రత్యేక అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గల సుమారు 3వేల మంది సభ్యులు ఉన్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో సంక్షేమ సంఘం ఆదాయం, ఖర్చులు పరిశీలించి, ఇంకా మున్ముందు రెడ్డి కులస్తుల కోసం చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలను సభ్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. రెడ్డి బంధువులందరు సర్వసభ్య సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా..

● కొనసాగుతున్న 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమం ● ఇప్పటివరకు 2,283 మందికి విముక్తి

హనుమకొండ రూరల్, జనవరి 4: వెట్టిచాకిరిలో మగ్గుతున్న చిన్నారులు, అనాథ, వీధి బాలలకు విముక్తి కల్పించి వారికి రక్షణ కల్పించేందుకు యేటా జనవరి మాసంలో ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట కార్యక్రమాలను చేపడుతోంది. బాలల హక్కుల పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా హనుమకొండ జిల్లాలో 2015 నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బావిభారత పౌరులైన బాలలు బడిలో చదువుకో వాల్సిన సమయంలో కార్మికులుగా మారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని భావించిన ప్రభుత్వం.. ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. యేటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పిస్తూ బడికి పంపే ఏర్పాట్లు చేస్తుంది. 2015 నుంచి ఇప్పటి వరకు సుమారు 2,283 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించారు. నిరక్షరాస్యత, అవగాహన లోపం, పేదరికం కారణంగా పలువురు తమ పిల్లలను పనులకు పంపుతుంటారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేడమే లక్ష్యంగా అధికారులు యేటా రెండు దపాలుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలీసులు, కార్మికశాఖ, బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, జిల్లా బాలల పరిరక్షణ



విభాగం, బాలల సంక్షేమ కమిటీ ప్రతినిధుల బృందాలను ఏర్పాటు చేస్తారు.

బాధ్యులపై కేసుల నమోదు

ఈ బృందాలు నెలరోజులపాటు వాహనాల గ్యారేజీలు, హోటళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి బాలకార్మికులను గుర్తిస్తారు. గుర్తించిన వారిలో 14ఏళ్లలోపు పిల్లలు బాలకార్మికులుగా పనిచేస్తుంటే బాధ్యులపై కార్మికశాఖ కేసులు నమోదు చేస్తుంది. హానికరమైన పనులలో 15-18 యేళ్ల వయస్సున్న వారుంటే కేసులు నమోదు చేస్తారు. గుర్తించిన బాలకార్మికులు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగిస్తారు. ఒకవేళ అనాథలుంటే వారిని ఆశ్రమాలకు తరలించి పాఠశాలల్లో చేర్పిస్తారు. బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తారు. అదృశ్యమైన పిల్లల వివరాలను దర్పణ్ పోర్టల్‌లో నమోదు చేసి, అనంతరం చర్యలకు శ్రీకారం చూడతారు. యాం టీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సహకారంతో అక్రమ రవాణాకు గురైన పిల్లలను గుర్తించేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తామరు. తప్పిపోయిన చిన్నారులు, దుర్భర జీవితం గడుపుతున్న వారిని గుర్తించి తల్లిదండ్రులకు, ప్రభుత్వ, వివిధ స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తారు.

గుర్తించిన బాలకార్మికుల వివరాలు ఇవే..

ఇయర్	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్	మొత్తం
2015	108	178	286
2016	152	172	324
2017	177	110	287
2018	103	113	216
2019	68	211	279
2020	168	–	168
2021	178	228	406
2022	112	95	207
2023	63	47	110

బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు

రమేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్



14 ఏళ్లలోపు వయస్సున్న బాల, బాలికలను పనిలో పెట్టుకోవడం నేరం. అలా ఎవరైనా బాల, బాలికలను పనిలో పెట్టుకొని బాలకార్మికులుగా మారిస్తే సంబంధిత యజమానిపై కేసులు నమోదు చేస్తాం. మైనర్లను ఎట్టిపరిస్థితుల్లో పనుల్లో పెట్టుకోవద్దు. ఎవరైనా బాలకార్మికులను గుర్తించినట్లయితే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

తనిఖీలు నిర్వహిస్తున్నాం..

సంతోష్‌కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల తో తమ పిల్లలను పని చేర్పిస్తున్నారు. వ్యాపారులు పిల్లల కు తక్కువ జీతాలు ఇచ్చి పనిలో పెట్టుకుంటున్నారు. తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు ఉన్నట్లయితే 1098కు సమాచారం అందించాలి. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తాం.

ఎమ్మెస్పీతోనే సామాజిక, రాజకీయ న్యాయం

ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

హసన్‌పర్తి, జనవరి 4: మహజన సోషలిస్టు పార్టీ (ఎమ్మెస్పీ)తోనే సామాజిక రాజకీయ న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మెస్పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం హసన్‌పర్తి మండల కేంద్రంలో పార్టీ జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంద కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెస్పీ పేదల కోసం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలోని అన్ని పార్టీలు అగ్రకుల పార్టీలేనని, వాటి ద్వారా న్యాయం జరుగదన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాబోయే రోజుల్లో మహజనులతో కలిసి మహజన రాష్ట్రాన్ని స్థాపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, నాయకులు రాజారపు భిక్షపతి, ఆరెపెల్లి పవన్, రాజారపు కిరణ్,



హసన్‌పర్తిలో ఎమ్మెస్పీ జెండావిష్కరిస్తున్న నాయకులు

ఆకారపు రాజు, బొక్క సాంబరాజు, కుక్కమూడి మొగిళి, నమీండ్ల సూర్యం, మేకల రమేశ్, మేకల కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలి జయంతి వేడుకలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

హనుమకొండ టౌన్, జనవరి 4: హనుమకొండ జిల్లా పరిషత్ హాల్‌లో తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం లూయిస్ బ్రెయిలి 215వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ రాజీవ్ శుక్లా, హనుమకొండ, వరంగల్ డీడబ్ల్యూవోలు మధురిత, శారద, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్ కె.అనితారెడ్డి, ప్రమోద హాస్పిటల్ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అతిథుల చేతుల మీదుగా 2024 బ్రెయిలి క్యాలెండర్ ఆవిష్కరించారు. బ్రెయిలి జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రాజు, ఉపాధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి జి.శ్రీను, అసోసియేట్ అధ్యక్షుడు ఎల్.రవిందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కార్తిక్, సంయుక్త కార్యదర్శి కమల, సలహాదారులు విజయచందర్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న తాళ్ల మల్లేశం

కాజీపేట, జనవరి 4: ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులకు కాంస్య పతకాలు లభించాయి. పతకాలు లభించిన వారిలో ఏడో తరగతి చదువుతున్న అయాన్ నాయక్, తొమ్మిదో తరగతి చదువుతున్న సాయిచరణ్ ఉన్నారు. వీరిని గురువారం తాళ్ల పద్మావతి పాఠశాల ఆవరణలో విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.


రెండు రోజులు నీటి సరఫరా బంద్

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండసిటీ), జనవరి 4: ధర్మసాగర్ నుంచి వచ్చే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు అమ్మవారిపేట వద్ద ఏర్పడిన లీకేజీ కారణంగా వరంగల్ పరిధిలో రెండు రోజులపాటు నీటి సరఫరా ఉండదని ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీమాబాద్, ఉర్సు, శివనగర్, పెరుకవాడ, చింతల్, ఖిలావరంగల్, తూర్పు, మధ్య కోట, ఎస్ఆర్ఆర్ తోట, యూసీ రెడ్డినగర్, నాగమయ్యగుడి, రుద్రమనగర్ ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

డిగ్రీ ఈ-కామర్స్ ప్రశ్నపత్రంలో రెండుసార్లు ఒకే ప్రశ్న

ఆందోళనకు గురైన ఫైనల్ ఇయర్ విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 4 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం జరిగిన బీకాం ఫైనల్ ఇయర్ 5వ సెమిస్టర్‌లోని ఈ-కామర్స్ పరీక్ష పత్రంలో ఒకేప్రశ్న రెండుసార్లు వచ్చింది. దీంతో ఆ సబ్జెక్ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వర్సిటీ పరిధిలో డిసెంబరు 20వ తేదీ నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మూడోసెమ్, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఐదోసెమ్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో అందులో భాగంగా గురువారం డిగ్రీ ఫైనల్ విద్యార్థులకు జరుగుతున్న ఐదో సెమిస్టర్ ఈ-కామర్స్ ప్రశ్నాపత్రం సెక్షన్-ఏలో 8 ప్రశ్నలకు గాను ఐదు ప్రశ్నలకు సమధానాలు రాయాల్సి ఉంటుంది. ప్రతీ ప్రశ్నకు మూడు మార్కుల చొప్పున ఐదు ప్రశ్నలకు 15 మార్కులు కేటాయించారు. కాగా, ప్రశ్నాపత్రంలోని 1లో ఏ నుంచి హెచ్ వరకు 8 ప్రశ్నలుండగా అందులో బి,హెచ్ ప్రశ్నలు (వాట్ ఈజ్ సెర్చ్ ఇంజన్) ఒకేలా ఉన్నాయి. దీంతో డిగ్రీ విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. 8 ప్రశ్నలకు గాను ఐదింటికి సమాధానాలు రాయాల్సి ఉండగా మూడు ప్రశ్నలు చాయిస్ కింద పోతాయి. అయితే ఈ కామర్స్ ప్రశ్నాపత్రంలో రెండు ప్రశ్నలు ఒకేలా ఉండడంతో ఒక్కచాన్స్ కోల్పోయామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నాపత్రం తయారు చేసిన అధికారులు ఈ తప్పిదాన్ని గుర్తించకపోవడంతో తమకు అన్యాయం జరిగిందని వారు వాపోతున్నారు.



కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ ఫైనల్ ఇయర్ ఐదో సెమిస్టర్ ఈ-కామర్స్ రెండుసార్లు వచ్చిన ఒకేప్రశ్న

జనగామలో కేయూ పరీక్షా కేంద్రాల తనిఖీ

కేయూ క్యాంపస్, డిసెంబరు 4: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల కేంద్రాలను గురువారం జనగామలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య బృందం తనిఖీలు నిర్వహించింది. జనగామలోని ఏకశిల డిగ్రీ, పీజీ కళాశాలలు, ఆర్ఆర్ఎం, రాజరాజేశ్వరి డిగ్రీ కళాశాల పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేశారు. అలాగే గురువారం వరంగల్ నగరంలో ఏఎస్ఎం డిగ్రీ పీజీ కళాశాల కేంద్రాన్ని కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవితోపాటు ఇతర అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎఎస్ఎం కళాశాలలో చూచిరాతకు పాల్పడిన విద్యార్థులను పట్టుకుని ముగ్గురిని డీబార్ చేసినట్లు డాక్టర్ తిరుమదేవి వెల్లడించారు. పరీక్షల ప్రశాంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



పరీక్షల కేంద్రాలను తనిఖీ చేస్తున్న పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, బన్న అయిలయ్య

కేయూ డిగ్రీ పరీక్షల్లో 36 మంది డీబార్

కాకతీయ యూనివర్సిటీ గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలో చూచిరాతకు పాల్పడిన విద్యార్థులను తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిలు గురువారం వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 16 మంది, వరంగల్‌లో 14 మంది, ఖమ్మంలో 6 మంది డీబారైనట్లు తెలిపారు. పరీక్షల నిబంధనల మేరకు వీరిపై చర్యలు చేపడుతామని వెల్లడించారు.

ఎవరికీ పట్టని 'కాజీపేట'

సమస్యల వలయంలో జంక్షన్ ● విస్తరణకు నోచుకోని చౌరస్తా ● ఐదేళ్లుగా పూర్తికాని ఆర్వోబీ ● ప్రతిపాదనలకే పరిమితమైన ఆస్పత్రి ● ఊసేలేని బస్టాండ్ నిర్మాణం


విస్తరణకు నోచుకోని కాజీపేట చౌరస్తా


అసంపూర్తిగా నిర్మించిన ఆర్వోబీ

కాజీపేట, జనవరి 4: హైదరాబాద్ - వరంగల్ ప్రధాన రహదారి.. రైల్వే పరంగా నిత్యం 150 రైళ్ల రాకపోకలు.. రోజూ వేలాది మంది ప్రయాణాలతో నిత్యం రద్దీగా ఉండే ట్రైసిటీలో భాగమైన కాజీపేట జంక్షన్ సమస్యలకు నిలయంగా మారింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎందరు పాలకులు మారినా.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. కాజీపేట మాత్రం అభివృద్ధిలో ఆమడ దూరంలోనే ఉంటోంది. ప్రతీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కాజీపేట అభివృద్ధిపై హామీలు ఇస్తూ ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆ ఊసే మరిపోతున్నారు. ఇది యాభై ఏళ్లుగా జరుగుతున్న తతంగమే.. ఎవరు ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్న వారిని విమర్శిస్తూ మళ్లీ వారు అధికారంలో రాగానే అదే తంతు కొనసాగిస్తున్నారు.

ఐదేళ్లుగా పూర్తికాని ఆర్వోబీ

కాజీపేట ఫాతిమానగర్‌లో అదనంగా నిర్మించడానికి తలపెట్టిన ఆర్వోబీ నిర్మాణం ఐదేళ్ల కిందట ప్రారంభించారు. అది ఇప్పటికీ పూర్తికాలేదు. అక్కడే ఉన్న పాత బ్రిడ్జిని 50 యేళ్ల కిందట అప్పటి జనాభాకు అనుగుణంగా నిర్మించారు. ప్రస్తుతం ఆ బ్రిడ్జి అక్కడక్కడా పెచ్చలూడుతూ ఎప్పుడు కూలుతుందో నని ప్రయాణికులు భయం, భయంగా ప్రయాణించే పరిస్థితి నెలకొంది. పైగా హైదరాబాద్ - వరంగల్ ప్రధాన రహదారి ఇది ఒక్కటే. హైదరాబాద్ నుంచి వరంగల్ వచ్చే ప్రజాప్రతినిధులు ఇదే బ్రిడ్జిగుండా ప్రయాణిస్తుంటారు. ఇక ఉదయం సమయాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వివిధ పనులకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ఏదైనా చిన్న ప్రమాదం జరిగితే గంటలకొద్దీ ట్రాఫిక్‌జామ్ అవుతోంది. కొత్త బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

విస్తరణకు నోచుకోని చౌరస్తా..

ట్రైసిటీలో చౌరస్తాలన్నీ దాదాపు విస్తరించారు. కొన్ని మోడల్ జంక్షన్‌లుగా రూపుదిద్దారు. కాజీపేట - వరంగల్ ప్రధాన రహదారి కాజీపేట చౌరస్తాను మాత్రం ఇప్పటికీ విస్తరించలేదు. సాయంత్రం అయ్యిందంటే నిత్యం రద్దీగా ఉండి ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ చౌరస్తా చూస్తేనే ఏదో గజిబిజి ప్రాంతంగా ఉంటోంది.. చౌరస్తా మధ్యలో వాటర్ ఫౌంటేన్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు గతంలో పలు సందర్భాలలో ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆ ఊసే మరిచారు.

వంద పడకల ఆస్పత్రికి సుస్తీ

కాజీపేటలో వందపడకల ఆస్పత్రి నిర్మాణానికి సుస్తి చేసింది. పదేళ్ల కిందట కాజీపేట మినీ మునిసిపాలిటీలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. గదుల నిర్మాణం, ఆస్పత్రికి కావాల్సిన అన్ని సౌకర్యాలు నిర్మించినప్పటికీ అది ఇప్పటికీ పూర్తికాలేదు. సాక్షాత్తూ నాటి ఆరోగ్య శాఖమంత్రి లక్ష్మారెడ్డి కాజీపేటలో మినీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పి హామీ ఇచ్చినా ఇప్పటికీ పూర్తి కాలేదు. కాజీపేట, పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురైనా, గర్భిణులు, వృద్ధులు వైద్యం కోసం హనుమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే.

బస్టాండ్ ఊసేలేదు..

కాజీపేటలో ఇప్పటికీ బస్టాండ్ లేదు. రోడ్డుపైన ఒక చిన్న రేకుల షెడ్డులోనే బస్టాండ్‌ను నడిపిస్తున్నారు. హనుమకొండ, వరంగల్ నుంచి హైదరాబాద్‌కు బస్సుల ద్వారా వెళ్లాల్సిన ప్రయాణికులకు ఇక నరకమే. ఎండాకాలం వస్తే ఎండకు, వర్షాకాలం వస్తే వర్షానికి ప్రజలు తడుచుకుంటూ బస్టాండ్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ముప్పై ఏళ్లుగా కాజీపేటలో బస్టాండ్ నిర్మించాలని నాటి మంత్రి దాస్యంప్రణయ భాస్కర్ ఎన్నో ఉద్యమాలు చేశారు. చౌరస్తా సమీపంలో ఆర్టీసీ సుమారు 15 ఎకరాల స్థలాన్ని పరిశీలించి హద్దులు కూడా వేశారు. ప్రైవేట్ వ్యక్తుల స్థలానికి మార్కెట్ రేటు కట్టివ్వకపోవడంతో అది రద్దయ్యిందని స్థానికులు తెలుపుతుంటారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాజీపేటలో బస్టాండ్ నిర్మాణం ఊసే లేదు. ప్రతి ఎన్నికల్లో కాజీపేటను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పే నాయకులు ఈసారైనా కాజీపేట అభివృద్ధికి తోడ్పడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ములుగు ఏజెన్సీలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయిన ముఖ్యంగా ములుగు ఎజెన్సీ మండలాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కన్నాయిగూడెం, ఏటూరునాగారం, వాజేడు, మంగపేట, వెంకటాపురం(నూగురు), తాడ్వాయిలోని పలు ప్రాంతాలలో రాత్రి ఉష్ణోగ్రతలు 16డిగ్రీల సెల్సీయస్‌గా నమోదవుతున్నాయి. పగటి పూట సగటున 31 డిగ్రీలుగా ఉంటోంది. చలికి తోడు తెల్లవారుజాము నుంచి పొగమంచు కురుస్తోంది. ఉదయం 9గంటల వరకు ఈ ప్రభావం ఉంటోంది. శ్వాసకోస వ్యాధులు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు.భూపాలపల్లి జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాత్రి సమయంలో చలి తీవ్రమవుతోంది. జిల్లాలో గురువారం గరిష్టంగా 30 డిగ్రీలు, కనిష్టంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. హనుమకొండ జిల్లాలో గత నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు తీవ్రగా కమ్ముకొని ఉంటుంది. సాయంత్రం 4 గంటలకే చలి ప్రారంభం అవుతోంది. నాలుగు రోజులుగా చలి తీవ్రత ఈ విధంగా నమోదు అయింది. సోమవారం (ఉష్ణోగ్రత 28.9- 15.5), మంగళవారం (ఉష్ణోగ్రత 29.1-16.8), బుధవారం (28.7- 17.0), గురువారం (29.4- 15.8)గా నమోదు అయింది.

జనగామలో 15.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

చలి కాలం కావడంతో జనగామ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం జిల్లాలో 15.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో అత్యల్పంగా చిల్పూరు మండలంలోని మల్కాపూర్‌లో 15.5 డిగ్రీలు, పాలకుర్తి మండల కేంద్రంలో 15.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవ్వగా.. అత్యధికంగా దేవరుప్పుల మండలంలోని కోలుకొండ గ్రామంలో 18.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

టీఎన్‌జీవోస్ మెంబర్‌షిప్ పెంచాలి

టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్


మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్

హనుమకొండ రూరల్, జనవరి 4: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం కృషిచేస్తున్న ఏకైక సంఘం టీఎస్‌జీవోస్ యూనియన్ మాత్రమేనని టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తెలిపారు. గురువారం హనుమకొండలో టీఎన్‌జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం కార్యవర్గ సమావేశం ఫోరం అధ్యక్షుడు కలకోట్ల భరత్ అధ్యక్షతన నిర్వహించారు. నూతనంగా ఉద్యోగ విధుల్లో చేరిన సభ్యులకు యూనియన్ మెంబర్‌షిప్ అందజేస్తామన్నారు. ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, శ్యాంసుందర్, రామునాయక్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, రాజేష్‌ఖన్నా, మిస్బా, ఆనంద్‌బాబు, సతీష్‌చంద్ర, జైవీర్, అలీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, జనవరి 4: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట దర్గాకు చెందిన దేవర వెంకటేశ్వర్లు (42) కూలిపని చేస్తూ మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య దేవర శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


దేవరాజు(ఫైల్)

కమలాపూర్, జనవరి 4 : కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మండ దేవరాజు(24) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు, ఎస్ఐ కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న యువకుడు స్వగ్రామం నుంచి అంబాల గ్రామ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ఓ చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ తెలిపారు. కాగా, సంఘటన స్థలంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

'ప్రజాపాలన'లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు

ఐనవోలు, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన' సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తూ వేదికలపై ఆసీనులవుతుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాపాలనలో భాగంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రొటోకాల్ ప్రకారం సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులే స్టేజీపై కూర్చోవాలి. కానీ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరైన సందర్భాల్లో వేదికపైకి పిలవకపోయినా కొందరు మండల, జిల్లా నాయకులు నేరుగా వచ్చి కూర్చుంటున్నారు. గురువారం కక్కిరాలపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో వేదికపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఉండగానే, పలువురు నాయకులు వచ్చి కూర్చున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రశ్నించగా, 'మేం పిలవకపోయినా వచ్చి కూర్చుంటున్నారు దానికి మేం ఏం చేయాలి..?' అంటూ అధికారులు చేతులెత్తేశారు. ఇటీవల పున్నేలులో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమంలో కూడా కాంగ్రెస్ నాయకులు వేదికపై కూర్చోవడంపై విమర్శలు వచ్చాయి. ఐనవోలు జాతర సమీక్ష సమావేశంలోకి కొందరు నాయకులు ఇలాగే చొచ్చుకవస్తే మంత్రి కొండా సురేఖ వారించి, వారిని బయటకు పంపించారు. అయినప్పటికీ రోజూ ఏదో ఒక కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతూనే ఉందని పలువురు వాపోతున్నారు. ఇదిలావుండగా, ఎమ్మెల్యే అధికారిక కార్యక్రమాల షెడ్యూల్‌ను ఇటు అధికారులు గానీ, అటు ప్రభుత్వ పీఏగాని ముందస్తుగా తెలుపడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చైల్డ్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభం

సుబేదారి, జనవరి 4: దివ్యాంగ పిల్లల కోసం బాలసముద్రంలో గురువారం చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ మాస్టర్ ఆఫ్ ఆక్యుపెన్షనల్ థెరపిస్టు డాక్టర్ అంకు కుమార్, చైల్డ్ సైకాలజిస్టు డాక్టర్ లీనా మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో పుట్టిన పిల్లల నుంచి 15 యేళ్ల పిల్లల వరకు ఎదుగుదలలో ఎలాంటి లోపం ఉన్నా, మాటలు రాకపోయినా, చదువులో వెనుకబడిన పిల్లలకు నిపుణులైన డాక్టర్లతో చికిత్స చేయిస్తామన్నారు. దివ్యాంగ పిల్లలకు ఇంకా అనేక రకాలైన లోపాలకు చికిత్స చేస్తామని, ఈ నెల 10వరకు ఉచితంగా చూస్తామన్నారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

వనదేవతల సన్నిధిలో వైద్య, విద్యుత్ ఉన్నతాధికారులు


వనదేవతలను దర్శించుకుంటున్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మేడారం, జనవరి 4: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌రెడ్డి గురువారం వేర్వేరుగా పర్యటించారు. వనదేతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహాజాతరకు తమ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పరిశీలించారు. ఈసందర్భంగా హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ వనదేవతల మహాజాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ మహాజాతరకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు. వరద ముంపుతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ధ్వంసమైనప్పటికీ వెనువెంటనే మరమ్మతులు చేపట్టి నిరంతరం విద్యుత్ అందించేదిశగా పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. కోటి 50 లక్షలకు పైగా వచ్చే మేడారం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. 230 ట్రాన్స్‌ఫార్మర్లు, తొమ్మిదిన్నర కిలోమీటర్ల విద్యుత్‌లైన్లు పూర్తిచేశామని అన్నారు. పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్, గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచామని అన్నారు. వారి వెంట డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, సీజీఎం మోహన్‌రావు, ఎస్ఈ మల్లార్‌నాయక్, డీఈ రాజేశ్వర్‌రావు, ఏడీఈ స్వామిరెడ్డి, ఏడీ వేణుగోపాల్, ఏఈ వేణుకుమార్, ఇతర విభాగాల డీఈలు, ఏడీలు, ఏఈలు ఉన్నారు.


వనదేవతలను దర్శించుకుంటున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

పాలకుర్తిలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ క్రీడలు

పాలకుర్తి, జనవరి 4 : పాలకుర్తి మండల కేంద్రంలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు యువ చైతన్య యూత్ బాధ్యులు ఎడవెల్లి సోమేశ్వర్ తెలిపారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి యవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన జట్లకు నగదుతో పాటు మెమొంటోలు అందచేస్తామని చెప్పారు. మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, నాల్గవ బహుమతి రూ.8వేలు, ఐదవ బహుమ తి రూ.6వేలు, ఆరవ బహుమతి రూ.4వేల నగదును అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల జట్లు 8328004828, 9676428932, 995969 5365 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మహిళపై దాడి

హనుమకొండ క్రైం, జనవరి 4: షట్టర్ యజమాని మాట్లాడనివ్వలేదని మహిళపై ఇద్దరు దాడి చేసి షాపును ధ్వంసం చేసిన ఘటన హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ న్యూరాయపురకు చెందిన వంగాల వాణిశ్రీ హనుమకొండ పోలీసు స్టేషన్ ముందు లైన్‌లో ఓ షట్టర్ అద్దెకు తీసుకుని లేడీస్ ఎంపోరియం నడిపిస్తోంది. షాపు ముందు ఉన్న గాదం స్వరూప, గాదం శృతిలు బుధవారం సాయంత్రం షాపునకు వచ్చి వాణిశ్రీతో గొడవకు దిగారు. తమతో చాలా రోజులుగా ఎందుకు మాట్లాడడం లేదని, ఇంటి యజమాని మాట్లాడవద్దని చెప్పడంతోనే తమతో మాట్లాడడం లేదని వాణిశ్రీపై ఇద్దరు గొడవకు దిగారు. వాణిశ్రీపై దాడి చేయడంతో పాటు షాపులో ఉన్న ఫర్నిచర్, సామగ్రిని ధ్వంసం చేశారు. తనపై దాడి చేయడంతో పాటు సుమారు రూ. 30 వేల విలువ గల సామగ్రిని ధ్వంసం చేసినట్టు పోలీసుకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం స్వరూప, శృతి పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరి అరెస్టు

మహాముత్తారం, జనవరి 4: అట్రాసిటీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి గురువారం వెల్లడించారు. మహాముత్తారం మండలంలోని మాదారానికి చెందిన ఎం.డి.అలావుద్దీన్, షఫీయొద్దీన్ డిసెంబరు 30న మాదారంలో ఎన్నికల విధుల్లో ఉన్న స్థానిక అంగన్‌వాడీ టీచర్ బెల్లంకొండ భీమక్క విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమెను కులంపేరుతో దూషించారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు విచారణ అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఇదే ఘటనలో అంగన్‌వాడీ టీచర్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కూడా కేసునమోదు చేశామన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, యూనియన్ నేతలు

బచ్చన్నపేట, జనవరి 4: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండలకేంద్రంలో గురువారం తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో పని చేసినప్పుడే సమాజం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిని వేణుగోపాల్‌గౌడ్, మండల అధ్యక్షుడు భాస్కరుని పృథ్వీరాజ్, కార్యదర్శి నవీన్‌కుమార్, అశోక్, విష్ణుకుమార్, శ్రావణ్ కుమార్, సంగీత, మాధురి తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ విభాగం అధికారి తనిఖీలు



దేవరుప్పులలోని క్లాత్ స్టోర్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారి ప్రకాష్

దేవరుప్పుల, జనవరి 4 : ఆపరేషన్ స్మైల్-ఎక్స్‌లో భాగంగా మండల కేంద్రంలోని దేవరుప్పులలో గురువారం బాలల పరిరక్షణ విభాగం అధికారి ప్రకాష్ బట్టల దుకాణాలు, హోటల్స్, కిరాణ షాపులు, ఇతర షాపులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఒకవేళ పనిలో పెట్టుకుంటే చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చిలుపూర్, జనవరి 4 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ తెలిపారు. ధర్మసాగర్ మండలంలోని కరుణాపురంకు చెందిన పూంద్రు రాజిరెడ్డి(50) బుధవారం వ్యక్తిగత పని నిమిత్తం మోటార్ సైకిల్‌పై స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిన్నపెండ్యాల సమీపంలో జాతీయ రహదారిపై హనుమకొండకు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు అతన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజిరెడ్డి తల, కాళ్లకు బలమైన గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించామని, పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాగా, రాజిరెడ్డి సోదరి సంపతి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప మాలధారులు



దేవరుప్పుల నుంచి శబరిమలకు తరలుతున్న అయ్యప్ప మాలధారులు

దేవరుప్పుల, జనవరి 4: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల అయ్యప్ప మాలధారులు గురువారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. దేవరుప్పులలోని సన్నిధానంలో గురుస్వామి లక్ష్మీనారాయణ ఇరుముడి కట్టించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులందరికీ గురుస్వామి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు దామోదర్, గొడిషాల శ్రీనివాస్, బిట్ల శ్రీనివాస్, మామిండ్ల రంజిత్, మురళి, మహేష్, సురేష్, సాయి, క్రాంతి, భాస్కర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

▸▸ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్

జఫర్‌గడ్, జనవరి 4 : అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన గ్రామసభల్లో భాగంగా గురువారం మండలంలోని కోనాయిచలం, ఏబీ తండా (శంకర్‌తండా), షాపల్లి, సూరారం గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా షాపల్లి గ్రామసభలో స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీ పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందరికీ సరిపోను దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎలాంటి ఆందోళన చెందకుండా హెల్ప్ డెస్క్‌ల సాయంతో దరఖాస్తులను నింపి అందజేయాలని సూచించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, ఎంఆర్‌ఐ అనిల్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ఇచ్చేందుకే ప్రజా పాలన

బచ్చన్నపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న ఆరు గ్యారెంటీ పథకాల అమలులో భాగంగా అర్హులను గుర్తించేందుకే ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించటం జరుగుతోందని స్పెషల్ ఆఫీసర్లు ఇస్మాయిల్, బాలకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రజా పాలన సదస్సులు నిర్వహించారు. లింగంపల్లి, మన్‌షాన్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, గంగాపూర్ గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నింపిన దరఖాస్తులను ఆయా గ్రామ పంచాయతీల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లలో అధికారులకు అందజేశారు. టీం లీడర్లు తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ ఆయా గ్రామాల్లో పరిశీలించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కుందెన మల్లేశం, పంజాల తారశ్రీధర్‌గౌడ్, తాతిరెడ్డి భవాని శశిధర్‌రెడ్డి, బందారపు సుశీల, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల బాధ్యులు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ

పాలకుర్తి : మండలంలోని వల్మిడి, సిరిసన్నగూడెం, కోతులబాద్, పెద్దతండా(బీ), ముత్తారం గ్రామాల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈసందర్భంగా మండల ప్రత్యేక అధికారి మొగులప్ప మాట్లాడుతూ గ్రామాల్లో దరఖాస్తులు చేసుకుంటున్న అందరికి దరఖాస్తులను అందచేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు దరఖాస్తుల కొరత లేదని స్పష్టం చేశారు. దరఖాస్తులను నింపేందుకు కొంత మందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశం, సర్పంచులు జరుపుల మోజీ బాలూనాయక్, సైదులు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

చిలుపూర్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, మండల అదనపు ప్రత్యేక అధికారి రమేష్ అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో గురువారం ప్రజా పాలన కార్యక్రమాన్ని ఎంపీడీవో పులుగు వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, పెన్షన్లను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఎలాంటి గడువు విధించలేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్ట అంజనీదేవి రవిందర్‌రెడ్డి, ఎంపీటీసీ సాదం నర్సింహులు, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఎమ్మార్వై కలువల శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ, ఏఈవోలు బూర్ల నర్సింహులు, గుగులోత్ వినయ్‌కుమార్, హెచ్ఈవో చాడ బుచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, వేముల వెంకటేశ్, ఊరడి రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బందులు పడొద్దు : ఆర్డీవో

స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం దరఖాస్తు ఫారాలకోసం ప్రజలు ఇబ్బందులు పడొద్దని ఆర్డీవో వాసం రామ్మూర్తి అన్నారు. గురువారం మండలంలోని మీదికొండ గ్రామంలో ప్రారంభమైన ప్రజా పాలన గ్రామసభను ఆయన సందర్శించి పరిశీలించారు. దరఖాస్తులు స్వీకరించే కౌంటర్ల వద్దకు వెళ్లి పరిశీలించి సూచనలు చేశారు. దరఖాస్తులు స్వీకరించే క్రమంలో రిజిస్టర్స్‌లో దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేయడంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతీ దరఖాస్తుదారుడి వివరాలు నమోదు చేసిన తరువాత రిజిస్టర్‌లో కౌంటర్ సిబ్బంది సంతకం పెట్టాలని సూచించారు. దరఖాస్తు దారులకు స్లిప్ అందిస్తున్నందున ఏ ఒక్క దరఖాస్తు పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం ప్రజా పాలన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరబోయిన మణెమ్మ యాదగిరి, డాక్టర్ సుగుణాకర్‌రాజ్, ఎంపీవో సుధీర్‌కుమార్, సెక్రటరీలు అశోక్, అశ్విన్‌కుమార్, సిబ్బంది జగన్నాథం, పొన్నం రమ, సువర్ణ, మంగ, ఉప సర్పంచ్ పొన్నం రంజిత్ కుమార్, నాయకులు శ్రీరాములు, పొన్నం రమేష్, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.



మీదికొండలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో రామ్మూర్తి



సూరారంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న డాక్టర్ మనోహర్, తహసీల్దార్



నాగిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న టీం అధికారి విశాలాక్షి



మండలంలోని పెద్దతండా(బి)లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



కృష్ణాజీగూడెంలో మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రమేష్

గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజు



జఫర్‌గడ్, జనవరి 4: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూక్య రాజు నియమితులయ్యారు. ఈయన జఫర్‌గడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రాజును నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షుడు కరుణాకర్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, సహకరించిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాల కనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కాగా, రాజును అధ్యాపకులు అభినందించారు.

అక్రమాలకు పాల్పడుతున్న తహసీల్దార్

▸▸ చర్యలు తీసుకోవాలని గిరిజనుల ఫిర్యాదు

జనగామ టౌన్, జనవరి 4 : అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న జనగామ తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఆర్ఐ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. జనగామ మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామానికి చెందిన పలువురు వృద్ధులు గురువారం కలెక్టరేట్‌లో ఏవో రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోర్టు ఆర్డర్‌ను ధిక్కరిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న తహసీల్దార్, ఆర్ఐను విధుల నుంచి తొలగించాలని కోరారు. 20 ఏళ్ల క్రితం ఇంటి నిర్మాణాల కోసం 20 మంది గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో పల్లె పార్కు కట్టేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించగా స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ తీర్పును అమలు చేయకుండా తహసీల్దార్, ఆర్ఐ పట్టాలు లేని వారికి ఇంటి నిర్మాణ అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు.



కలెక్టరేట్ ఏవోకు ఫిర్యాదు చేస్తున్న వృద్ధులు

ఐదు దశాబ్దాల సేవకు దక్కిన గౌరవం

▸▸ తాటికొండలో అర్చకుడికి గుడి నిర్మాణం

▸▸ గ్రామస్తుల సహకారంతో నిర్మించిన కుమారులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 4 : మండలంలోని తాటికొండ గ్రామంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో 52ఏళ్ల పాటు అర్చకుడిగా విశేష సేవలందించిన సౌమిత్రి రంగాచార్యులకు గుడిని నిర్మించారు. ఆయన గత ఏడాది జనవరి 23న అకాల మరణం చెందారు. ఆయన సేవలు గుర్తించిన గ్రామస్తులు సీతారామచంద్ర స్వామి ఆలయం సమీపంలోని దేవాలయభూమిలో రంగాచార్యులకు గుడిని నిర్మించాలని కుమారులకు తెలిపారు. రంగాచార్యులు కుమారులు లక్ష్మణాచార్యులు, రామాచార్యులు రూ.5 లక్షల స్వంత ఖర్చులతో గుడిని నిర్మించి రంగాచార్యుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కాగా, గురువారం భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకులు శేషయ్య, యాజ్ఞిక పీఠం ప్రధాన అర్చకులు కిశోర్‌స్వామి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాపోలు మధుసూదన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చల్లా ఉమాదేవి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డిల సమక్షంలో అర్చకుడి గుడిని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నాయకులు రంగాచార్యుల సేవలను కొనియాడారు. గ్రామంలో అర్చకుడిగా, వైద్యుడిగా సేవలు అందించిన వ్యక్తి విగ్రహాన్ని నెలకొల్పినట్లు తెలిపారు. శ్రీరాముడి సేవకుడిగా రామబంటులా గ్రామంలోని ప్రతీ ఒక్కరితో ఆప్యాయతను పంచుకొని అందరి మన్ననలు పొందిన వ్యక్తి రంగాచార్యులు అని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు ఎస్పీ మాధవాచార్యులు, అర్చకుల బృందం సభ్యులు రాఘవాచార్యులు, రంగాచార్యులు, కృష్ణకుమారి, వకులమాల, వరుణకుమారచార్యులు, గ్రామ ఉప సర్పంచ్ మారపాక రాములు, ఐలోని సుధాకర్‌గౌడ్, సానాది రాజు, అక్కనపెల్లి వెంకటయ్య, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



అర్చకుడికి నిర్మించిన గుడిని ప్రారంభిస్తున్న అర్చకులు, నాయకులు

రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారు..

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి, జనవరి 4 : తెలంగాణ రాష్ట్ర ఖజానాను దోపిడీ దొంగల్లా దోచుకుని, సంపదను పూర్తిగా ఖాళీ చేశారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ఖజానాను లూటీ చేశారని ఆరోపించారు. 390 డెకాయిట్ (దోపిడీదారులు) సెక్షన్‌కు బీఆర్ఎస్ నాయకులందరూ అర్హులేనని ఎద్దేవా చేశారు. న్యాయవాదిగా చట్టాల గురించి తెలిసి మాట్లాడుతున్నానన్నారు. బీఆర్ఎస్ నాయకులు చట్టాలు, రాజ్యాంగం గురించి తెలియని దద్దమ్మలని విమర్శించారు. పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ నాయకులు నెల రోజులు కూడా పూర్తి చేసుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రవేశపట్టిన ఆరు గ్యారెంటీల అమలును జీర్ణించుకోలేక 420 చీటర్స్ అంటూ బుక్‌లెట్ విడుదల చేయడం వారి అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశామని మంత్రి చెప్పారు. మిగతా వాటి కోసం ప్రతి గ్రామంలో ప్రజా పాలన గ్రామసభలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అమలుకాని హామీలపై ప్రశ్నించే హక్కు లేకుండా గొంతు నొక్కి, హౌస్ అరెస్టులు, నిర్బంధాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు.

ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి, జనవరి 4 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాలకుర్తి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనుముల లక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో గురువారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తు చేయాలని సూచించారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, రూ.100 రుసుం చెల్లించి ఈ నెల 6 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. WWW.TSWREIS.IN అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

మట్టి తరలిస్తున్న 8 మంది బైండోవర్

తరిగొప్పుల, జనవరి 4 : మండలంలోని అబ్దుల్‌నాగారం రెవెన్యూ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న 8 మందిని గురువారం అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. అబ్దుల్‌నాగారం గ్రామానికి చెందిన మూల నరేష్ అనే వ్యక్తి తన జేసీబీ సహాయంతో మరో ఏడుగురు వ్యక్తులతో కలిసి ట్రాక్టర్లతో అక్రమంగా మట్టిని మరియపురం గ్రామానికి తరలిస్తున్నారని చెప్పారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

హత్య కేసులో అరెస్టు

▸▸ నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితుడి అరెస్టును చూపుతున్న సీఐ

మహదేవపూర్ రూరల్, జనవరి 4 : మహిళ హత్య కేసు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని మహదేవపూర్ సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో మండలంలోని అంబట్‌పల్లిలో బుధవారం హత్య జరిగిన విషయం విదితమే. ఓ యువకుడిని మట్టుబెట్టడానికి వెళ్లిన అదే గ్రామానికి చెందిన నర్సింహస్వామి అతడు అక్కడ లేకపోవడంతో తల్లి నల్లా పద్మను హత్య చేశాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. తప్పించుకొని తిరుగుతున్న నర్సింహస్వామిని అరెస్టు చేశామని, అనంతరం రిమాండ్‌కు తరలిస్తున్నామని సీఐ తెలిపారు. మీడియా సమావేశంలో ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారులు బాగుపడేనా?

▸▸ గుంతలమయంగా తండాల రోడ్లు


▸▸ ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు

▸▸ పలు తండాల్లో నిర్మాణం కాని బీటీ రోడ్లు

తరిగొప్పుల, జనవరి 4 : మండల పరిధిలో 32 గిరిజన తండాలు ఉండగా, కొన్నింటికి రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇందులో బీల్యతండా, దేశ్యాతండాలకు ఇప్పటికీ బీటీ రోడ్లు మంజూరి కాలేదు. యేళ్ల తరబడి నిత్యావసరాల నిమిత్తం తండావాసులు తరిగొప్పుల మండల కేంద్రానికి రావడానికి మట్టి రోడ్లపైనే ప్రయాణం సాగిస్తున్నారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ పాలనలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంతో పట్టించుకోక పోవడంతో అభివృద్ధికి నోచుకోక తండావాసుల బీటీ రోడ్డు నిర్మాణం కలగానే మిగిలింది. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో ఆయా తండాల గిరిజనులు బీటీ రోడ్ల నిర్మాణంపై ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్లు గుంతలమయంగా మారాయి. దేశ్యాతండా నుంచి అంకుషాపూర్‌కు వెళ్లే దారిలోని కల్వర్టులో వర్షాకాలం వస్తే నీరు నిలిచి తండావాసులకు ఇతర గ్రామాలతో రాకపోకలు నిలిచిపోతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి మండల కేంద్రానికి రావడానికి తక్కువ సమయం పడుతుందని చెబుతున్నారు.



భారీ వర్షాలకు తెగిన దేశ్యాతండా మట్టి రోడ్డు (ఫైల్)



అంకుషాపూర్, దేశ్యాతండా గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

వర్షాకాలంలో నడవడమే కష్టం..

లావుడ్య ఉమాశంకర్, దేశ్యాతండా



వర్షాకాలం వస్తే మట్టి రోడ్లపై నడవడం చాలా కష్టంగా ఉంటుంది. ఏ అర్ధరాత్రి పాము, తేలు కుడితే బాధితున్ని మండల కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. తండా నుంచి అంకుషాపూర్‌కు వెళ్లే మధ్యలో కల్వర్టులో వర్షాకాలం నీరు చేరి రెండు నుంచి మూడు రోజులు రాకపోకలు నిలిచిపోతాయి. కాంగ్రెస్ పాలనలోనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

నెల రోజులు రాకపోకలు బంద్..

లావుడ్య మంక్యా, దేశ్యాతండా



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంకుషాపూర్ నుంచి దేశ్యాతండాకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమై నెల రోజుల పాటు తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం వేళ పాలు తెచ్చుకోవాలంటే వెంకట్‌తండా మీదుగా అంకుషాపూర్ వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. అధికారులు స్పందించి మట్టిరోడ్డుకు మరమ్మతులు చేయించాలి.